epaper.manachourasta.com

# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 56 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శనివారం, 24 జనవరి 2026 | పేజీలు : 04



అందరూ సమన్వయంతో పనిచేయాలి

- సీపీ సన్ ప్రీత్ సింగ్

4



# జనగామలో సీతక్కకు ‘ప్రశాంత్’త కరువు!

## ఉద్రిక్తతల నడుమ మంత్రి సీతక్క పర్యటన

- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ప్రోటోకాల్ చిచ్చు
- కాన్వాయిని వెంటాడుతూ గొడవలకు దిగిన నేతలు
- అసహనం వ్యక్తం చేసిన మంత్రి

2



జనగామ జిల్లాలో పర్యటించిన రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు సొంత పార్టీ నేతలే ‘ప్రశాంత్’త లేకుండా చేసిన్రు. మంత్రి పర్యటన ఆది నుంచి అంతం వరకు కాన్వాయిని వెంటాడి మరీ గొడవకు దిగడంతో ఉద్రిక్తతకు దారితీసింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ వర్గాల మధ్య తలెత్తిన విభేదాలు బాహాబాహీగా తలపడే వరకు వెళ్లడం స్థానికంగా కలకలం సృష్టించింది. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అనుచరులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి కుమారుడు ప్రశాంత్ రెడ్డి వర్గీయులు ఒకరిపై ఒకరు ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇరు వర్గాల నాయకులు, కార్యకర్తలు పరస్పర వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. ఒక దశలో ఉద్రిక్తత పెరిగి ఇరువర్గాలు తోపులాటకు దిగాయి. సొంత పార్టీ నేతలు సైతం తన మాట వినకపోవడంతో మంత్రి ఒకింత అసహనం వ్యక్తం చేశారు. - మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి

# కల్లు తాగిన కోతుల్లా ప్రవర్తించారు

- కాంగ్రెస్ గుండాగిరిని తీవ్రంగా ఖండిస్తున్నా..
- మద్యం మత్తులో వచ్చి నాపై దాడికి ప్రయత్నించారు
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

3



wanted

విలేకరులు కావలెను

మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way

# జనగామలో సీతక్కకు 'ప్రశాంత్'త కరువు!

- ఉద్రిక్తతల నడుమ మంత్రి సీతక్క పర్యటన
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ప్రోటోకాల్ చిచ్చు
- కాన్వాయిని వెంటాడుతూ గొడవలకు దిగిన నేతలు
- అసహనం వ్యక్తం చేసిన మంత్రి



**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** జనగామ జిల్లాలో పర్యటించిన రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు సొంత పార్టీ నేతలే 'ప్రశాంత్'త లేకుండా చేసిన్రు. మంత్రి పర్యటన ఆది నుంచి అంతం వరకు కాన్వాయిని వెంటాడి మరీ గొడవకు దిగడంతో ఉద్రిక్తతకు దారితీసింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ వర్గాల మధ్య తలెత్తిన విభేదాలు బాహాబాహీగా తలపడే వరకు వెళ్లడం స్థానికంగా కలకలం సృష్టించింది. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అనుచరులు, కాంగ్రెస్ పార్టీ నియోజ కవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి కుమారుడు ప్రశాంత్ రెడ్డి వర్గీయులు ఒకరిపై ఒకరు ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇరు వర్గాల నాయకులు, కార్యకర్తలు పరస్పర వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. ఒక దశలో ఉద్రిక్తత పెరిగి ఇరువర్గాలు తోపులాటకు దిగాయి. సొంత పార్టీ నేతలు సైతం తన మాట వినకపోవడంతో మంత్రి ఒకింత అసహనం వ్యక్తం చేశారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

## అసలేం జరిగిందంటే..

జనగామ బైపాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన మహనీయులు వీరనారి చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, సర్వాయి పాపన్న విగ్రహాల ఆవిష్కరించేందుకు మంత్రి సీతక్క అక్కడకు చేరుకున్నారు. రెండు విగ్రహాల వద్ద మంత్రి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కొబ్బరి కాయలు కొట్టారు.. అదే సమయంలో మూడో విగ్రహం వద్ద ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ జమున (బీఆర్ఎస్)ను కొబ్బరికాయ కొట్టాలని కోరగా.. కాంగ్రెస్ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి కుమారుడు ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వర్గాల మధ్య వాగ్వాదం పెరిగి తోపులాటకు దారితీసింది. 'పల్లా గో బ్యాక్..' అని కాంగ్రెస్ నేతలు.. 'కాంగ్రెస్ డౌన్ డౌన్..' అని బీఆర్ఎస్ నేతలు నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అడ్డుకున్నారు. అక్కడ మొదలైన గొడవ మంత్రి పర్యటన అంతం వరకూ కొనసాగింది. అక్కడి నుంచి ఆర్టీసీ చౌరస్తాలో సూర్య నమస్కారాల శిల్పాల ఆవిష్కరణ సమయంలోనూ ఇదే తరహా ఉద్రిక్తత పరిస్థితులు పునరావృతమయ్యాయి. నాయకుల మధ్య మాటల యుద్ధం సాగుతుండగానే మంత్రి సీతక్క బతుకమ్మ కుంటలో పునరుద్ధరణ పనులు, ఆర్ అండ్ బీ బంగ్లాను, కొత్తగా నిర్మించిన వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ ను ప్రారంభించారు. మంత్రి పర్యటనలో కలెక్టర్ రిజ్వాన్ బాషా, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, ఆర్డీఓ గోపిరామ్ సహా పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





## అప్పటి వరకు ప్రశాంతం..

మంత్రి సీతక్క పర్యటన నేపథ్యంలో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. అయితే మంత్రి షెడ్యూల్ ప్రకారం కాకుండా కొంత ఆలస్యంగా జనగామకు చేరుకున్నారు. మంత్రి రాక కోసం జనగామ బైపాస్ వద్ద కాంగ్రెస్ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి తన అనుచరులతో ఎదురు చూస్తున్న సమయంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అక్కడకు చేరుకున్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి రాగానే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి షేక్ హ్యాండ్ ఇచ్చి మరీ స్వాగతం పలికారు. కొంత సేపు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులంతా కలివిడిగా మాట్లాడుకుని నవ్వుకుంటూ ఉన్నారు. మంత్రి వచ్చిన తర్వాత కొమ్మూరి కుమారుడు ప్రశాంత్ రెడ్డి అక్కడు చేరుకుని.. కొబ్బరికాయ విషయంలో పల్లాను అడ్డుకోవడంతో గొడవ మొదలైంది.

## ఎన్నికల సమయంలోనూ..

కొమ్మూరి ప్రతాప్ రెడ్డి కుమారుడు ప్రశాంత్ రెడ్డి 2023 డిసెంబర్‌లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కూడా వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. జనగామ పట్టణంలోని 14వ వార్డు అంబేద్కర్ నగర్‌లో పోలింగ్ ఆలస్యం కావడంతో రాత్రి వరకు ఓటింగ్ కొనసాగింది. ఆ సమయంలో ప్రశాంత్ రెడ్డి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడంతో బీఆర్ఎస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. లాఠీ చార్జి వరకు దారితీసింది. తాజాగా ప్రశాంత్ రెడ్డి మంత్రి ప్రోగ్రాంలో గొడవకు కారణం కావడంతో అప్పటి ఘటనను పలువురు చర్చించుకుంటూ కనిపించారు. ఏది ఏమైనా.. సాఫీగా సాగాల్సిన 'సీతక్క' జనగామ పర్యటనలో ప్ర'శాంతం' లేకుండా చేశారంటూ సొంత పార్టీ నేతలే చర్చించుకుంటున్నారు.





## కట్టడిలో 'ఖాకీలు' ఫెల్యూర్..

మంత్రి సీతక్క పర్యటనలో జరిగిన గొడవను కట్టడి చేయడంలో స్థానిక పోలీసులతో పాటు మంత్రి వెంట వచ్చిన రోప్ పార్టీ పోలీసులు పూర్తిగా విఫలం చెందినట్టు పట్టణ ప్రజలు బాహాటంగా చర్చించుకుంటున్నారు. జనగామ బైపాస్ రోడ్డులో మొదటి గొడవ జరిగినప్పుడు అలర్ట్ కావాల్సిన పోలీసులు మిన్నకుండి పోవడంతో మంత్రి పాల్గొన్న ప్రతి ప్రోగ్రాంలో నిరసనలు, తోపులాటలు చోటు చేసుకున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల నినాదాల మధ్యే మంత్రి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరిగాయి. ఇక జిల్లా కేంద్రంలో గంట పాటు సాగిన మంత్రి పర్యటనతో స్థానిక ప్రజానీకం సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



## కలెక్టర్‌కు తప్పని ఇబ్బందులు..

మంత్రి సీతక్క పర్యటనలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా, అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ కు ఇబ్బందులు తప్పలేదు. మంత్రి షెడ్యూల్ ప్రకారం కాకుండా ఎక్కడి నుంచి ఎక్కడి వెళ్తున్నారనేది జిల్లా ఉన్నతాధికారులకు సైతం అర్థం కాకుండాపోయింది. బతుకమ్మ కుంట ప్రారంభోత్సవానికి వచ్చే సమయంలో కలెక్టర్ దాదాపు అర కిలో మీటర్ దూరం నుంచే వాహనం దిగి పక్కనే ఉన్న దుర్గమ్మ గుడిలో నుంచి పరుగులు పెట్టి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఇక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ వద్ద కలెక్టర్ వెళ్లే సరికే ప్రారంభోత్సవం పూర్తయ్యింది. ఆ తర్వాత వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ ప్రారంభోత్సవ సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాలు బాహాబాహీకి దిగడంతో కలెక్టర్ అక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు. ఒక జిల్లా ప్రథమ పౌరుడు, మెజస్ట్రేట్ స్థాయి అధికారికి పోలీసులు రక్షణ ఇవ్వలేక పోయారని జిల్లా అధికారుల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



# కల్లు తాగిన కోతుల్లా ప్రవర్తించారు

- కాంగ్రెస్ గుండాగిరిని తీవ్రంగా ఖండిస్తున్నా..
- మద్యం మత్తులో వచ్చి నా మీద దాడికి ప్రయత్నించారు
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



**మన చౌరాస్తా, జనగామ :** మంత్రి పర్యటనలో కాంగ్రెస్ నాయకులు కల్లు తాగిన కోతుల్లా ప్రవర్తించారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం జనగామ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జనగామ కాంగ్రెస్ గుండాల తీరు పై తీవ్రంగా మండిపడ్డారు. 'జనగామ పట్టణంలో మంత్రి సీతక్క చేతుల మీదుగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు ప్రోటోకాల్ ప్రకారం ఎమ్మెల్యేగా నాకు ఆహ్వానం వచ్చింది. మా కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్‌తో కలిసి ఆయా ప్రాంతాల్లోనే ఉండి, వారికి బొకేలు ఇచ్చి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికాం. కానీ అక్కడ ఉన్న కొంతమంది కాంగ్రెస్ నాయకులు కావాలనే కొబ్బ రి కాయ కొట్టే సమయంలో గందరగోళం సృష్టించారు. కొందరు మద్యం మత్తులో వచ్చి, ఎమ్మెల్యే పల్లా గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ, కార్యక్రమాన్ని భంగపెట్టే ప్రయత్నం చేశారు. ఇది పూర్తిగా ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ఈ రోజు ప్రారంభమైన వెజ్ -నాన్‌వెజ్ మార్కెట్ పనులు 7 కోట్ల వ్యయంతో నాలుగేళ్ల క్రితమే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమయ్యాయి. రెండేళ్లుగా పనులు నిలిచిపోయినా నేను ఆరు నెలలుగా వెంటపడి పని చేయిస్తే ఇవాళ పని పూర్తి అయింది. బతుకమ్మ కుంట అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. మున్సిపాలిటీలో వచ్చిన ఎల్ఆర్ఎస్ నిధుల్లో నుంచి దాదాపు రూ.3 కోట్లు వెచ్చించి బతుకమ్మ కుంటను అభివృద్ధి చేయించాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వైకుంఠధామానికి నేను ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు, కేటీఆర్ గారి సహకారంతో రూ.25 కోట్ల నిధులు మంజూరు చేయించాను. కాంగ్రెస్ నాయకుల అడ్డంకుల వల్ల ఇప్పటికి రూ.19 కోట్లు మాత్రమే వచ్చాయి. అందులో భాగంగా దాదాపు 2 కోట్లు వైకుంఠధామానికి, అలాగే నెహ్రూ పార్క్ సమీపంలోని 60 అడుగుల రోడ్డుకు పనులు ఇవాళ పెట్టినం. అయినా కొన్ని కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు కల్లు తాగిన కోతిలా ప్రవర్తిస్తూ నా మీద దాడికి కూడా ప్రయత్నించారు. జనగామకు చెందిన వారు అసలు కాదు. జనగామ ప్రశాంత వాతా వరణాన్ని చెడగొట్టే ప్రయత్నం చేయడం దుర్మార్గం. మా కార్యకర్తలు, నాయకులు ఎంతో నిదానంగా వ్యవహరించారు. మంత్రి సీతక్కకి అన్ని కార్యక్రమాల్లో గౌరవం ఇచ్చి, శాంతియుతంగా కార్యక్రమాలను పూర్తిచేశాం. జనగామ అభివృద్ధి కోసం గానుపహాడు బ్రిడ్జికి రూ.90 లక్షలు, చిటకో డూరు బ్రిడ్జికి నిధులు, అందె శ్రీ పుట్టిన రెబర్తి ప్రాంతానికి అదనపు నిధు లు, మినీ సమ్మక్క,సారలమ్మ జాతరకు ప్రత్యేక నిధులు ఇవ్వాలని వినతిపత్రాలు అందించాం..' అని చెప్పారు. 'కొమ్మూరి ప్రతాపరెడ్డి కొడుకు ఆధ్వర్యంలో జరిగిన ఈ గుండాగిరిని తీవ్రంగా ఖండిస్తున్నాం..' అని అన్నారు. కావాలనే మద్యం తాగించి గొడవలు చేయడం జనగామ ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరు. ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టే వారిని పోలీసులు గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.




# ప్రతి ఓటర్ ఓటు హక్కు వినియోగించుకోవాలి

## జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**హన్మకొండ, మన చౌరాస్తా :** ప్రజాస్వామ్యంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటర్‌గా తమ పేరు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పిలుపునిచ్చారు. ఈ నెల 25న 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, సిబ్బందితో కలెక్టర్ స్నేహ శబరిష్, ఓటర్లతో దేశ పౌరులుగా మేము ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతాం. కులం, మతం, జాతి, వర్గం, భాషాపరమైన ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తాం' అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేసేందుకు, ఆయా ఎన్నికల్లో అత్యధిక ఓటర్లు ఓటును సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించేందుకు జాతీయ ఎన్నికల సంఘం 2011 నుంచి ప్రతి ఏటా జనవరి 25ను జాతీయ ఓటర్ల నిర్వహిస్తోందన్నారు. దినోత్సవాన్ని ప్రజాస్వామ్య దేశంలో అందరికీ ఆమోదయోగ్యమైన, ఎక్కువ మంది ఆదరణను పొందిన పాలకులను మన ప్రజాప్రతినిధులుగా ఎన్నుకునేందుకు ఓటు హక్కు కల్పించడం జరిగిందన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యత గురించి గతంలో ప్రజలకు చాలా తక్కువగా అవగాహన ఉండేదని, ప్రస్తుతం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నందున ప్రతి పౌరుడు ఓటు విశిష్టతను తెలుసుకొనేందుకు అవకాశం కలిగిందన్నారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ రవి, డిఆర్డీఓ మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి సీతక్కకు మున్సిపల్ కార్మికుల వినతి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ బతుకమ్మ కుంట ఓపెనింగ్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దానసరి అనసూయ (సీతక్క)కు మున్సిపల్ యూనియన్ కార్మికుల సమస్యలపై మెమోరండం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఔట్సోర్సింగ్ వర్కర్స్& డ్రైవర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు మల్లిగారి రాజన్న, కార్మికుల అధ్యక్షుడు మిద్దపాక రాజు, ప్రధాన కార్యదర్శి గడిపే ప్రవీణ్ కుమార్, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు మునిగే రవి, వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు వాతల యాదగిరి, మునిగే కరుణాకర్, గుర్రపు నరేష్, కొలపాక ఎల్లయ్య, తోకల కిష్టయ్య, డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మసి రాజు, పెద్దగల్ల సుధాకర్, బోట్ల నాగరాజు, మహిళా అధ్యక్షురాలు గుర్రపు లక్ష్మి, రాగల దేవేంద్ర, గంధమల్ల సునీత, జేరిపోతుల సుమలత పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించడమే ముఖ్య లక్ష్యం

## ప్రిన్సిపాల్ పావని కుమారి

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ శ్రీ కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు జనగామ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పేరెంట్స్ తో మాట్లాడుతూ ప్రస్తుత తెలంగాణ ప్రజా ప్రభుత్వం, ఇంటర్మీడియట్ బోర్డు ఉచిత విద్య, అడ్మిషన్స్, పాఠ్య పుస్తకాలు, ఆధునిక తరగతి గదులు, డిజిటల్ క్లాస్ రూమ్స్, అన్ని సౌకర్యాలతో సైన్స్ ల్యాబ్స్, ఆన్లైన్ అటెండన్స్ మరియు తల్లితండ్రులకు మెస్సేజ్ లు, విద్యార్థులకు చదువుతో పాటు ఆట స్థలాలు, ఆట వస్తువులు సమాకూర్చడం, యోగ మానసిక వికాస తరగతులు, స్టూడెంట్స్ కౌన్సిలర్స్ ఇలా అనేక సౌకర్యాలు కల్పిస్తున్నది. ఈ సౌకర్యాలను విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు ఉపయోగించుకోని రాబోయే ఎగ్జామ్స్ లో ఉత్తమ ఫలితాలు సాధించడమే ముఖ్య లక్ష్యం అని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్టాఫ్ సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ లెక్చరర్ వేముల శేఖర్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పస్కుల శ్రీనివాస్, మరిపెల్ల రవి ప్రసాద్, విద్యార్థుల తల్లితండ్రులు, అధ్యాపకుల బృందం పాల్గొన్నారు





# పలు అంశాలపై కీలక చర్చ

**కొమురవెల్లి, మన చౌరస్తా :** కొమురవెల్లి మండల కేంద్రంలోని రసులాబాద్ గ్రామంలో సర్పంచ్ అనూష గౌడ్ ఆధ్వర్యంలో పలు అంశాలను చర్చించారు. అంతకంటే ముందు ఎంపీపీ ఎస్ పాఠశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలోని గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో మూడో వార్డు మరియు నాలుగో వార్డుకు సంబంధించిన డ్రైనేజీ పనుల సమస్యను వివరించారు. గ్రామంలోని ప్రజలు అండర్ డ్రైనేజీ పనులు నిర్మించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన పాలకవర్గం వీటిపై తీర్మానం చేసి పనులు చేపిస్తామని ప్రజలకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుదర్శన్, మాజీ సర్పంచ్ స్వామి గౌడ్, వార్డు సభ్యులు మల్లేశం, బహుదూర్, మంజుల, పంచాయతి కార్యదర్శి బాల నర్సింగ్, పాఠశాల హెచ్ఎం సుప్రియ రమేష్, గ్రామ పెద్దలు యాదయ్య, శ్రీనివాస్, సందీప్, సంతోష్, పాఠశాల విద్యార్థి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# భక్తిభావం.. ఉపాధి మార్గం

■ **ఆధ్యాత్మికత వైపు పెరుగుతున్న ప్రజల అడుగులు**



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ఆధునిక జీవనశైలి వేగంగా విస్తరిస్తున్నప్పటికీ హిందూ సంస్కృతి, సంప్రదాయాల పట్ల ప్రజల్లో భక్తిభావం ఏమాత్రం తగ్గడం లేదు. చిన్నా-పెద్దా వయస్సు భేదం లేకుండా పూజలు, వ్రతాలు, నోములు ఆచరిస్తూ ఆధ్యాత్మికత వైపు అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా ఇటీవలి కాలంలో వయస్సు పైబడిన వారికంటే యువతే ఎక్కువగా దైవదర్శనాలు, పూజా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తుండటం విశేషంగా మారింది. దీని ప్రభావంతో పూజా సామగ్రి విక్రయాలు గణనీయంగా పెరుగుతున్నాయి.

**వ్రతాలు, నోములు, మాలధారణలు**

వరలక్ష్మీ వ్రతాలు, గౌరీ వ్రతాలు, సత్యనారాయణ స్వామి పూజలు, అయ్యప్ప పూజలు, వివిధ దేవతల మాలధారణలు, షష్టిపూర్తి, అన్నప్రాసన, ఉపనయనాలు, భూమి పూజలు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలు, వ్యాపార ప్రారంభోత్సవాలు వంటి ప్రతి శుభకార్యంలో విగ్రహారాధన, పూజలు తప్పనిసరి అయ్యాయి. వీటికి అవసరమైన పూజా సామగ్రి కారణంగా ఈ రంగం వేగంగా విస్తరిస్తోంది.

**పూజా సామగ్రి దుకాణాలతో ఉపాధి**

ఇళ్లలో, వాణిజ్య రంగాల్లో నిత్యం నిర్వహించే పూజలు, ప్రత్యేక కార్యక్రమాల కోసం పూజా వస్తువుల అవసరం పెరగడంతో ముల్కనూరులో పూజా సామగ్రి దుకాణాలు విరివిగా వెలుస్తున్నాయి. దీనివల్ల అనేక మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు.




**పూజా స్టోర్ల ఏర్పాటుకు ఆదరణ**

ప్రస్తుతం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో పూజా స్టోర్ అందుబాటులో ఉంది. ప్రజల్లో పెరుగుతున్న ఆధ్యాత్మిక ఆసక్తికి ఇది నిదర్శనంగా భావిస్తున్నారు. అన్ని రకాల పూజలకు అవసరమైన సామగ్రి ఒకే చోట లభించడంతో భక్తులకు మరింత సౌలభ్యం కలుగుతోంది.

**వ్యాపారం బాగుంది**

సాయి నికిత పూజా స్టోర్స్ నిర్వాహకుడు కోల రమేష్ మాట్లాడుతూ "ప్రస్తుతం ప్రజలు ఆధ్యాత్మికత వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. వివిధ దేవతల మాలధారణలు, పూజల్లో పాల్గొంటున్నారు. అన్ని రకాల పూజలకు అవసరమైన సామగ్రిని ఒకే చోట అందుబాటులో ఉంచడంతో వ్యాపారం బాగానే సాగుతోంది" అని తెలిపారు.

**దైవచింతన అవసరం**

వీరభద్ర స్వామి ఆలయ అర్చకులు జానకిపురం శర్మ మాట్లాడుతూ "ప్రతి ఒక్కరిలో దైవచింతన ఉండాలి. అప్పుడు సమాజంలో ఆధ్యాత్మికత పెరిగి అరాచకాలు తగ్గుతాయి. ఆలయాలు పెరగడం, పూజలపై ఆసక్తి పెరగడం మంచి పరిణామం. పూజా సామగ్రి దుకాణాలు పెరగడం వల్ల ప్రజల్లో దేవుడిపై నమ్మకం, విశ్వాసం మరింత బలపడుతుంది" అని పేర్కొన్నారు.

# అంతా సమన్వయంతో పనిచేయాలి

■ **వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**




**హనుమకొండ, మన చౌరాస్తా :** మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కాబోయే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో పోలీస్, ఆర్టీసీ అధికారులతో సమన్వయ సమావేశాన్ని శుక్రవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముందుగా గత జాతర సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తిన ప్రాంతాలు, కారణాలతో పాటు, పోలీస్ మరియు ఆర్టీసీ సంయుక్తం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా మేడారం జాతర ఆర్టీసీ శాఖ చేసిన ఏర్పాట్లపై ఆర్టీసీ రీజినల్ మేనేజర్, విజయ భాను పోలీస్ కమిషనర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మేడారం తరలి వస్తున్న భక్తుల రద్దీని గమనిస్తూ ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందస్తూ చర్యలు తీసుకోవాల్సి వుంటుందని, మేడారంకు వెళ్లే మార్గంలో బస్ నిలిపి వేసి ప్రయాణికులకు టికెట్లు జారీ చేయద్దని, గతంలో సమస్యలు సృష్టించిన డ్రైవర్లని విధుల్లోకి తీసుకోవద్దు, డ్రైవర్లకు తప్పనిసరిగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలి.ఒక వేళ బస్ బ్రేక్ డౌన్ అయితే రోడ్డుపై నిలిచిన పోయిన బస్ ను తక్షణమే మరమ్మత్తు చేసే విధంగా టెక్నీషియన్లను అందుబాటులో వుందే విధంగా క్యాంప్ లను ఏర్పాటు చేయాలని, బస్సులను రోడ్ల ఇరువైపులా నిలిపివేయవద్దని, బస్టాండ్ నుండి బయలుదేరే బస్సులు ఎక్కడ అగకుండా మేడారం బస్టాండ్ లో మాత్రమే బస్ ఆగుతుందని, కావును భక్తులు కాలకృత్యాలు తీర్చుకొని, తినుబండారాలు తమ తెచ్చుకోవాలని బస్టాండ్ లో అధికారులు విస్తృతం ప్రచారం చేయాలని సీపీ ఆర్టీసీ అధికారులకు వివరించగా, హన్మకొండ బాల సముద్రం నుండి జాతరకు వెళ్లే బస్సులకు ట్రాఫిక్ సమస్యలు రాకుండా ముందస్తూ చర్యలు తీసుకోవాలని. అదే విధంగా నగరంలో ఏదైనా ట్రాఫిక్ అంతరాయం కలిగితే జాతరకు వెళ్లే బస్సులను ప్రత్యామ్నాయ మార్గాల నుండి తరలించేందుకు తగు ఏర్పాట్లు చేసుకోవసింది గా పోలీస్ కమిషనర్ ట్రాఫిక్ అధికారులకు సూచించారు. ఈ సమావేశం లో డీసీపీలు అంకిత్ కుమార్, దార కవిత, ఆర్టీసీ , ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీలు సత్యనారాయణ, జితేందర్ రెడ్డి, జానీ న్సర్సింహులు, ఆర్టీసీ డిప్యూటీ ఆర్. యం లు భాను కిరణ్, మహేష్, డిపో మేనేజర్లు రవి చందర్, అర్పిత, ధర్మాసింగ్, ట్రాఫిక్ ఇన్స్ స్పెక్టర్లు సీతా రెడ్డి, వెంకన్న, సుజాత ఇతర పోలీస్, ఆర్టీసీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# కొత్తకొండ దేవస్థానం హుండీ లెక్కింపు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ గ్రామంలో ఉన్న వీరభద్ర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం హుండీ విప్పి లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. దేవదాయ శాఖ పరిశీలకులు జి. సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హుండీ లెక్కింపులో నోట్ల రూపంలో రూ.24,74,476 నాణేల రూపంలో రూ.2,03,705 లభించగా, మొత్తం హుండీ ఆదాయం రూ.26,78,181/ (అక్షరాలలో ఇరువది ఆరు లక్షల డెబ్బై ఎనిమిది వేల ఒక వంద ఎనభై ఒక రూపాయలు)గా నమోదైంది. లెక్కింపులో వచ్చిన మొత్తాన్ని యూనియన్ బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజరాజేశ్వరి సేవా సమితి (హనుమకొండ), సరస్వతి సేవా సమితి (కొత్తకొండ) సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, ముల్కనూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, అర్చకులు, వస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## హుస్నాబాద్ నియోజకవర్గాన్ని

# మూడు ముక్కలు చేశారు

■ **మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబుపై గిరిజన విద్యార్థి సంఘం ధ్వజం**

**హుస్నాబాద్, మన చౌరాస్తా:** తన రాజకీయ స్వార్థం కోసం హుస్నాబాద్ నియోజకవర్గాన్ని మూడు ముక్కలు చేసి, ప్రజలకు తీరని అన్యాయం చేసిన మాజీ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్ తక్షణమే ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మరియు బిజెపి మండల ముఖ్య నాయకులు గుగులోత్ తిరుపతి నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వైఖరిని తీవ్రంగా ఎండగట్టారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రధాన కేంద్రంగా ఉన్న హుస్నాబాద్‌ను గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజల మనోభావాలకు విరుద్ధంగా సిద్దిపేట జిల్లాలో కలిపారని విమర్శించారు. నియోజకవర్గాన్ని సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల పరిధిలోకి విడగొట్టడం వల్ల ప్రజలు ప్రభుత్వ మరియు రాజకీయ పనుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ఉండకుండా హనుమకొండలో నివాసం ఉంటూ కేవలం తన ఓటు బ్యాంకును కాపాడుకోవడానికే సతీష్ కుమార్ ఈ కుట్రకు పాల్పడ్డారని ఆరోపించారు. గత పదేళ్లలో నియోజకవర్గంలోని గ్రామాలు, తండాల అభివృద్ధిని గాలికొదిలేసి, కేవలం తన అనుచరులకు వత్తాసు పలుకుతూ గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించారని మండిపడ్డారు. హుస్నాబాద్ ప్రజల అభివృద్ధిని కాంక్షించి, తక్షణమే ఈ నియోజకవర్గాన్ని తిరిగి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కలిపేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మంత్రులతో సంప్రదింపులు జరిపి తన గత తప్పిదాన్ని సరిదిద్దుకోవాలని హితవు పలికారు. ప్రజల మనోభావాలను దెబ్బతీసినందుకు ఆయన బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**